మాస్కులు ధరించి.. అవగాహన కల్పించి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న బీజేపీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని సుమిత్ర నగర్‌లో ఆదివారం ప్రధాని మోదీ 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన పరిపాలన, తీసుకున్న నిర్ణయాలను ప్రజలకు తెలిపే విధంగా అవగాహన కల్పించారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్. వంశీ రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని చిత్రపటంతో ఉన్న మాస్కులను ధరించారు.

రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవం



కల్యాణంలో పాల్గొన్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ తదితరులు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్‌లో రేణుకా ఎల్లమ్మ కల్యాణం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. ముఖ్య అతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, గంధం రాజు, నళిని కాంత్, శివ చౌదరి, రమణ, గోవిందు, వాసు తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్‌కు సన్మానం



కూకట్‌పల్లి: బాలానగర్ డివిజన్‌లోని అంబికా కాలనీ చర్చిలో పాస్టర్ పాల్, సంఘ సభ్యులు ఆదివారం టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన బండి రమేష్‌ను ఘనంగా సన్మానించారు. దైవ గీతాలు ఆలాపన చేశారు. భవిష్యతలో బండి రమేష్ మరిన్ని పదవులు పొందాలని సంఘం నిర్వాహకులు ఆకాంక్షించారు.

హెచ్‌సీయూలో 1న డాక్టర్స్ డే

రాయదుర్గం: 'డాక్టర్స్ డే'ను పురస్కరించుకొని గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు అసోసియేషన్ కన్వీనర్ టి రామస్వామియాదవ్ తెలిపారు. క్యాంపస్‌లోని స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు పాల్గొంటారని, అలాగే అపోలో ఆస్పత్రుల డిపార్ట్‌మెంట్ ఆఫ్ నెఫ్రాలజీ హెడ్ డాక్టర్ రవి ఆండ్రూస్ పాల్గొంటారని తెలిపారు.

బీఆర్ఎస్ కోవర్టుగా మారి కాంగ్రెస్‌ని దెబ్బతీయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

సుభాష్‌నగర్: కాంగ్రెస్ పార్టీకి చక్కటి క్యాడర్ ఉందని, బీఆర్ఎస్‌కు కోవర్టుగా మారి పార్టీని దెబ్బతీయొద్దని కొంతమంది కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు హెచ్చరించారు. శనివారం మహాన్యూస్ ఛానల్ కార్యాలయంపై జరిగిన దాడి విషయమై ఆదివారం దూలపల్లిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. తమ ప్రభుత్వమే అధికారంలో ఉందనే భ్రమలో కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు రెచ్చిపోతున్నారని, వారి ఆటలు సాగనివ్వబోమని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీకి ఒక చరిత్ర ఉందని, అనవసరంగా మా పార్టీ కార్యకర్తల చేతికి పని చెప్పొద్దని సూచించారు. సమాజానికి నాలుగో పిల్లర్ మీడియా అని, అలాంటి మీడియా సంస్థలపై దాడులు సరైంది కాదన్నారు. ఎంతో మంది ఫోన్లను ట్యాపింగ్ చేసి వ్యక్తిగత విషయాలను తెలుసుకోవడం దుర్మార్గమన్నారు. సమావేశంలో కార్యక్రమంలో డీసీసీ మెదక్ జిల్లా అధ్యక్షుడు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్, నక్క ప్రభాకర్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ గరిసే నరేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి భరోసా..
స్వయం సహాయక సంఘాలు !

- మూసాపేట సర్కిల్ పరిధిలో గ్రూపుల ఏర్పాటుకు అధికారులు కృషి
- ఇటీవలే 65 కొత్త గ్రూపుల ఏర్పాటు
- మరిన్ని సంఘాల ఏర్పాటుకు అవకాశం



బిస్మిల్లా గ్రూప్ సభ్యులు



సంఘాల ప్రాధాన్యత గురించి అవగాహన కల్పిస్తున్న అధికారులు

మూసాపేట: మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే ఆ కుటుంబం అభివృద్ధిలోకి వస్తుంది. అలాగే సమాజం కూడా మరింత అభివృద్ధి చెందుతుంది. మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెటి వారికి చేయూత అందిస్తున్నది. చిన్న చిన్న వ్యాపారాలు ఏర్పాటు చేసుకుని ఆ కుటుంబ వృద్ధిలో తమ వంతు సాయం అందించాలని ఎంతో మంది మహిళలు కోరుకుంటున్నారు. కానీ ఆర్థిక ఇబ్బందులు, ఇతర కారణాల వల్ల ముందుకు వెళ్లలేని మహిళలకు ప్రభుత్వాలు చేయూత అందిస్తున్నాయి. స్వయం సహాయక గ్రూపులు ఏర్పాటు చేసి వారికి బ్యాంకుల నుంచి వడ్డీ లేని రుణాలను అందిస్తున్నాయి. ఆ దిశగా మూసాపేట, కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో మరిన్ని మహిళా గ్రూపులు ఏర్పాటు చేసేందుకు అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు.

మహిళా గ్రూపులో చేరితే..

మహిళా స్వయం సహాయక గ్రూపులో చేరిన మహిళలు రూ. లక్ష నుంచి 20 లక్షల వరకు వడ్డీ లేని రుణాలను బ్యాంకుల ద్వారా పొందవచ్చు. కిరణా షాపులు, టైలరింగ్, బ్యూటీషియన్, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికాభివృద్ధి చెందడానికి సంఘాలు దోహదపడతాయి. మహిళా గ్రూపులో ఉన్న మహిళలు మరణిస్తే రూ.10 లక్షల బీమా సౌకర్యం, అంగవైకల్యం సంభవిస్తే రూ.5 లక్షల ఆర్థిక సహాయం, ఆ మహిళ తీసుకున్న పొదుపు సంఘాల రుణాలు మాఫీ అవుతుంది. ప్రభుత్వ పాఠశాలల, ఇతర కార్యక్రమాల్లో, జీహెచ్ఎంసీ తలపెట్టే పనుల్లో కూడా మహిళా గ్రూపు సభ్యులను నియమిస్తుంది.

65 కొత్త గ్రూపుల ఏర్పాటు

మూసాపేట సర్కిల్ పరిధిలో ఇప్పటికే 1685 మహిళా గ్రూపులు ఉన్నాయి. ప్రాజెక్టు ఆఫీసర్ సమక్షంలో సర్కిల్ పరిధిలోని ప్రతి డివిజన్‌లో కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రిసోర్స్ పర్సన్స్ ఇంటింటికీ వెళ్లి మహిళలకు మహిళా గ్రూపుల ఉపయోగాలను వివరిస్తున్నారు. మూసాపేట డివిజన్‌లోనే ఇప్పటి వరకు 15 కొత్త గ్రూపులు ఏర్పడ్డాయి. ఇంటింటికీ సర్వే నిత్యం చేస్తూనే ఉన్నారు. మొత్తం మూసాపేట సర్కిల్ పరిధిలో ఇప్పటి వరకు 65 కొత్త గ్రూపులు ఏర్పడ్డాయని, మరో 20 గ్రూపులు బ్యాంక్ అకౌంట్ ఓపెన్ దశలో ఉన్నాయని అధికారులు వివరించారు.

వ్యాపారాల్లో రాణిస్తున్న మహిళలు

మోతీనగర్‌లోని అవంతి నగర్ తోటలో మహాలక్ష్మి అనే మహిళ బిస్మిల్లా గ్రూపుగా ఏర్పడి 10 మంది సభ్యులు కలిసి శ్రీలక్ష్మి పికిల్స్ అండ్ ఫుడ్స్ వ్యాపారాన్ని ప్రారంభించారు. గోంగూర, నిమ్మ, అల్లం, మామిడి కాయ, ఉసిరి కాయ, చికెన్ పచ్చళ్లు, రొయ్యలు, మటన్ వంటి పచ్చళ్లు తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల్లోనే కాకుండా అమెరికా, రష్యా వంటి విదేశాలకు కూడా తమ వ్యాపారాన్ని విస్తరించారు. పచ్చడి వ్యాపారమే కాకుండా మసాలా పొడుల తయారీ 10 మంది మహిళలు వారి ఇంటి వద్ద టైలరింగ్ చేస్తూ ఆర్థికంగా ఎదుగుతున్నారు. ఇటీవల బేగంపేటలో ఇండియన్ బ్యాంక్ ఏర్పాటు చేసిన స్టాల్‌లో వీరి పచ్చళ్లు, మసాల పొడులు కూడా ప్రదర్శించి ఎంతో మంది అభినందనలు పొందారు.

ఆర్థికంగా చేయూతనిస్తాం

సర్కిల్ పరిధిలో ప్రతి డివిజన్‌లో ఇంటింటికి వెళ్లి మహిళా గ్రూపులను ఏర్పాటు చేసి వారికి ఆర్థికంగా చేయూత అందిస్తున్నాం. అర్హులైన ప్రతి మహిళా గ్రూపులో చేరాలని ప్రోత్సాహిస్తున్నాం. స్వయం సహాయక సంఘాల్లో చేరటం ద్వారా వారికి వచ్చే లాభాలను వివరిస్తున్నాం. గ్రూపుల ఏర్పాటు జరుగుతుంది. మరికొన్ని రోజుల పాటు ఇంటింటి సర్వే కొనసాగుతుంది.

– వంశీకృష్ణ, ఉప కమిషనర్



పీజేఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం





బాలానగర్‌లో పీజేఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆల్విన్‌కాలనీ: గచ్చిబౌలి ఫ్లైవర్‌కు దివంగత కార్మిక నేత పి. జనార్దన్‌రెడ్డి పేరు నామకరణం చేయడం అభినందనీయమని నాయకులు అన్నారు. జగద్గిరిగుట్ట చౌరస్తా, ఆర్‌పీ కాలనీలో పీజేఆర్ విగ్రహానికి ఎన్ఎస్‌యూఐ శేరిలింగంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు సామ్, పీజేఆర్ అభిమానులు పీజేఆర్ విగ్రహానికి ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకులు సాయికుమార్, పీజేఆర్ అభిమానులు లింగయ్య, బాషిపాక యాదగిరి, పరశురాం, యూత్ కాంగ్రెస్ నాయకులు అశోక్, శ్రావణ్, చరణ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి: గచ్చిబౌలి ఫ్లైఓవర్‌కు సీఎల్‌పీ నాయకుడు, మాజీ మంత్రి, దివంగత పి. జనార్దన్‌రెడ్డి పేరు నామకరణం చేయడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం బాలానగర్‌లోని ఆయన విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షులు రమేష్ హాజరై క్షీరాభిషేకం నిర్వహించారు.

గురుపూజ మహోత్సవం

మోతీనగర్: దేశానికి అవసరమైన త్యాగం, సేవ, సమర్పణ అనే ఈ మూడు గుణాలను రాష్ట్రీయ స్వయం సేవ కల్పించిందని మాననీయ నగర సంఘ్ డాక్టర్ ఎస్.కే. జశ్వాల్ అన్నారు. ఆదివారం మూసాపేట డివిజన్ మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో రాష్ట్రీయ సంస్థ మధురానగర్ శాఖ ఆధ్వర్యంలో గురుపూజ మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా భారతమాత చిత్రపటానికి పూల మాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

12న ఐటీ ఉద్యోగులకు అవగాహన

రాయదుర్గం: ఐటీ ఉద్యోగుల కోసం గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో జూలై 12వ తేదీన ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. శాంతిసరోవర్ క్యాంపస్‌లోని ఇన్నర్‌స్పేస్‌లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం సాగుతుంది. ఈ సందర్భంగా 'ఇన్నర్ ఎక్స్‌లెన్స్ రీట్రీట్' పేరిట 'ఒత్తిడి లేని జీవితాన్ని గడపడానికి మనస్సును పునఃప్రారంభించడం'పై ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ సమావేశంలో ముంబాయికి చెందిన అంతర్జాతీయ వక్త, కార్పొరేటర్ ట్రైనర్ బి.కె. శ్రేయ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు.

ఆకట్టుకున్న కథక్, భరతనాట్య ప్రదర్శనలు

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం కథక్, భరతనాట్య ప్రదర్శనలతో అలరించారు. పూణే నుంచి వచ్చిన కథక్ కళాకారిణి నేహాదాంలే ప్రదర్శనలో గణేశా వందన, తాల్‌ధమార్, మ్యూజిక్ అంశాలను ప్రదర్శించారు. అంజు అరవింద్ శిష్యబృందం అలరిపు, పుష్పాంజలి, జతిస్వరం, అంబస్తుతి, కావడి చిందు, అర్ధనారీశ్వర అష్టకం, ముద్దుగారే యశోద, తిల్లాన తదితర అంశాలను కళాకారులు శిఖ, అద్రిత, ఆశ్రీత, మానస, సాధ్వి, కృత్విక, నేత్ర, సమర, దియా, మైత్రి, ఎంలీన్, అమూల్య, అక్షిత ప్రదర్శించారు.





అమ్మవారికి చిట్టిగాజుల దండలు



సనత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు ఆర్‌బీ నరేష్ ప్రతి యేటా మాదిరిగా ఏయేడు కూడా బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకంగా రూపొందించిన దండను ఆదివారం ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సంవత్సరం బెంగుళూరు నుంచి తెప్పించిన చిట్టిగాజుల దండలను అమ్మవారి అలంకరణ నిమిత్తం అందజేశారు. గత రెండు సంవత్సరాలుగా ప్రత్యేకంగా దండలు తయారు చేయించి అమ్మవారికి సమర్పించటం ఆనవాయితీగా వస్తున్నది.

పేద విద్యార్థులకు దాతలు సహకరించాలి

ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్: పేద విద్యార్థులకు సాయం చేసేందుకు దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే శ్రీగణేష్ పిలుపునిచ్చారు. ఆదివారం ఈస్ట్ మారేడు పల్లిలోని లోహియా నగర్ బస్తీలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ సి సంతోష్ యాదవ్, ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీ గణేష్ ముఖ్య అతిథిగా హాజరై 300 మంది పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు ,టిఫిన్ బాక్స్ లు అందజేశారు. అంతకుముందు సీనియర్ నాయకులు సి సంతోష్ యాదవ్ ఆధ్వర్యంలో బస్తీలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. సామాజిక సేవా కార్యక్రమాలు చేపడితే ఆదరణ అభిమానాలు పొందుతామని తెలిపారు.

విద్యుత్ భద్రతా వారోత్సవాలు



సిబ్బందికి ఎర్తింగ్ రాడ్‌ను అందజేస్తున్న అధికారులు

కూకట్‌పల్లి: తెలంగాణ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ మేడ్చల్ సర్కిల్ విద్యుత్ భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఈ భద్రతా వారోత్సవాలు జులై 2 వరకు నిర్వహించనున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. సిబ్బందిచే అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వినియోగదారులకు సేవలను అందిస్తూ సంస్థకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ప్రతి సిబ్బంది హెల్మెట్, లైన్‌మెన్ సేఫ్టీ బెల్ట్, టూల్ కిట్, ఎర్తింగ్ రాడ్, గ్లౌజ్ వంటి పరికరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు.

తాగునీటి ఎద్దడిని నివారించాలి



సమస్యను వివరించిన పద్మావతినగర్ వాసులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పద్మావతి నగర్ కాలనీలో ఇటీవల కొద్ది రోజులుగా మంచినీటి కొరతతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆదివారం అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగంను కలిసి సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తక్షణమే ఈ సమస్యను సంబంధిత జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షులు జావిదొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


ఉచిత వైద్య శిబిరం



కూకట్‌పల్లి: బాలాజీనగర్ డివిజన్ వివేక్ నగర్‌లోని శ్రీ చైతన్య స్కూల్‌లో సనాతన ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్ యూత్ వింగ్ యువధ్వని, శ్రీరంగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీహోలిస్టిక్ హాస్పిటల్స్, లయన్స్ క్లబ్ హైదరాబాద్ బుద్ధపూర్ణిమ సంయుక్త సహకారంతో ఉచిత వైద్య శిబిరం, రక్త దాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. శ్రీరంగం ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ సత్యం శ్రీరంగం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్య బృందాన్ని, రక్తదాతలను సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ముళ్లపూడి అమ్రిత్, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి గౌతమ్ వలివేటి, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణరాజ్‌పుత్, యూత్ వింగ్ సభ్యులు పాల్గొన్నారు.

ఫీజుల భారం !

- ప్రయివేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు
- నిబంధనలు పాటించని యాజమాన్యాలు
- పట్టించుకోని అధికారులు


Name of the student
Admission in to class VII
Special fee 5000/-
Monthly fee (10 months)
Books 5750/-
Uniform
Required Certificates
1.Birth Certificate Xerox
2.Aadhaar Xerox
3.Passport size photos-2
Signature

పాఠశాల పేరు లేకుండా పుస్తకాల బిల్లు ఇచ్చిన యాజమాన్యం

ఓల్డ్ బోయిన్‌పల్లి: ప్రయివేట్ పాఠశాలల్లో చదవాలంటే వేలు, లక్షల్లో ఫీజులు చెల్లించాల్సిందే. అడ్మిషన్, డొనేషన్, పుస్తకాల పేరుతో ఆయా యాజమాన్యాలు దోపిడీ చేస్తున్నాయి. విద్యను వ్యాపారం చేసి అంగడి సరుకుగా అమ్ముకుంటున్నా విద్యాశాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యాహక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడంలో యంత్రాంగం విఫలమైంది.

అడ్మిషన్‌కు వేలల్లో ఫీజులు

ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో సుమారుగా 20 ప్రయివేట్ స్కూల్స్‌లో విద్యార్థుల అడ్మిషన్ కావాలంటే వేలల్లో ఫీజులు. వాటికి తోడు యూనిఫాం, బుక్స్, సాక్స్, షూ, టై, బెల్ట్ ఇవన్నీ వారు నిర్ణయించిన ధరల ప్రకారం తీసకోవాల్సిందే. ఇంత బహిరంగంగా దందా జరుగుతున్నా .అధికారులు ఏం చేస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఫిర్యాదు చేసినా కూడా పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. కొన్ని ప్రయివేట్ సూళ్లల్లో స్పెషల్ ఫీజులంటూ 5 వేలు వసూల్ చేస్తున్నారు. రూ.4880 నుంచి 12 వేల వరకు పుస్తకాల పేరుతో వసూలు చేస్తున్నారు.ఒకప్పుడు విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటే ఐదు నుంచి 10 పుస్తకాలు మాత్రమే ఉండేవి. కానీ నేడు ప్రయివేట్ స్కూల్ పుణ్యమా అని 10 కిలోల నుంచి 40 కిలోల వరకు స్కూల్ బ్యాగులను మోసుకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

నోట్ బుక్స్ ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువగా అమ్మవద్దు. మా పరిధిలోని పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేసి బుక్స్ అమ్మ వద్దని ఆదేశించాం. యూనిఫాం, టై, షూ, స్కూల్స్ ఫీజుల విషయంలో ఫిర్యాదులు అందాయి. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే స్కూల్ సీజ్ చేస్తాం. అన్ని పాఠశాలల్లో తనిఖీలు నిర్వహిస్తాం.

– హరిశ్చంద్ర, బాలానగర్ ఎంఈఓ

కాలనీల అభివృద్ధికి ఎల్లవేళలా కృషి

కుత్బుల్లాపూర్: కాలనీల అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్‌గౌడ్ అన్నారు. ఆదివారం జీడిమెట్ల డివిజన్ బృందావన్ కాలనీలో రూ.91 లక్షలతో అభివృద్ధి పరిచిన పార్కును కార్పొరేటర్ తారాచంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో శివారు ప్రాంతాల అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. ఇప్పటికే బందావన్ కాలనీలో మిషన్ భగీరథ ద్వారా మంజీరా నీటి సదుపాయం, వీధి దీపాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కాలనీ వాసులంతా ఐకమత్యంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమని, బృందావన్ కాలనీ అభివద్ధి తన బాధ్యత అని అన్నారు.

'రైతు సంక్షేమం' ఎక్కడ ?

కొంతమంది రైతులకే రైతు భరోసా

- అందరికీ అమలు కానీ రుణమాఫీ
- మేడ్చల్ జిల్లాలో రైతు పరిస్థితి అగమ్య గోచరం



మేడ్చల్: జిల్లాలో రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రోత్సాహకాలు అందరికీ అందడం లేదు. మేడ్చల్ సహా కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, మల్కాజ్‌గిరి, ఉప్పల్, నియోజకవర్గాలు ఉండగా.. మేడ్చల్ నియోజకవర్గంలో మెజారిటీ రైతులు భూములను సాగుచేస్తున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రైతులు ఉన్నా.. కొంత మేరకు సాగు ఉంది. మిగతా నియోజకర్గాలు హైదరాబాద్‌లో అంతర్భాగంగా ఉన్నాయి.

బోనస్ పడలే..

సన్న వడ్లు పండించిన రైతులకు ప్రభుత్వం నిర్దేశించిన ధరకు రూ.500 కలిపి బోనస్ ఇస్తామని ప్రకటించినా.. స్థానిక రైతులకు ఇంత వరకు బోనస్ సొమ్ము ఖాతాలలో జమ కాలేదు.

◆ మేడ్చల్ జిల్లాలో గత సీజన్‌లో అధికారులు 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, 3,253 టన్నుల సన్న వడ్లు, 13,453 టన్నుల దొడ్డు వడ్లను కొనుగోలు చేశారు. జిల్లా వ్యాప్తంగా 14 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 3,253 టన్నుల సన్న వడ్లను కొనుగోలు చేయగా.. క్వింటాల్‌కు రూ.2,320 బోనస్ రూ.500 కలిపి రూ.2,820 అకౌంట్లలో జమ కావాల్సి ఉండగా.. బోనస్ మినహాయించి రూ.2,320 మాత్రమే అధికారులు జమ చేశారు. ప్రభుత్వం ఇస్తామని చెబుతున్న బోనస్ రూ.500 ఇంత వరకు రైతుల ఖాతాల్లో జమ చేయలేదు.

రైతు భరోసాకు నోచుకోని రైతులు..

మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా 49,000 వేల మంది రైతులు ఉండగా.. అందరూ రైతులు ప్రభుత్వం రైతు భరోసాకు నోచుకోవడం లేదు. తొలి విడతలో కేవలం మూడు చింతలపల్లి మండలానికి చెందిన 4,291 మంది రైతులకు రైతుభరోసా వచ్చింది. రైతులు, రైతు నాయకుల నిరసనలు, ప్రభుత్వ పెద్దలకు వినతిపత్రాలు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 20,507 మంది రైతులకు రైతు భరోసా నిధులు వారి అకౌంట్లలో మంగళవారం జమ చేశారు.

◆ తాజాగా ఇప్పటి వరకు మొత్తం 24,798 మంది రైతులకు రైతు భరోసా నిధులు ఇచ్చి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందజేసింది. జిల్లాలో 49 వేల మంది రైతులు ఉండగా.. 24,202 మంది రైతులు ఇప్పటి వరకు రైతు భరోసాకు నోచుకోవడం లేదు. జిల్లాలో సగం మంది రైతులకు రైతుభరోసా లేకపోవడంతో రైతులు ప్రభుత్వ పెద్దల మాటలపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రుణమాఫీ కొందరికే..

జిల్లా వ్యాప్తంగా 49 వేల మంది రైతులు ఉండగా అందులో సగం మంది రైతులు బ్యాంకులు, రైతు సహకార సంఘాల ద్వారా రూ.2 లక్షల లోపు రుణాలు తీసుకున్నా.. అందరికి రుణమాఫీ కాలేదు. జిల్లాలో కేవలం 4,371 మంది రైతులకు మాత్రమే ఇప్పటి వరకు రుణమాఫీ అయ్యింది. ఔటర్‌కు దగ్గరగా ఉన్న రైతులను ధనిక రైతులనే సాకుతో వారికి రాష్ట్రంలో మిగతా ప్రాంతాల రైతుల మాదిరిగా రైతు భరోసా ఇవ్వకపోవడంపై మేడ్చల్ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బోనస్ త్వరలోనే వస్తుంది

జిల్లాలో రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన సన్న రకం వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రభుత్వం నుంచి తప్పకుండా వస్తుంది. రైతుల ఖాతాల్లో త్వరలోనే బోనస్ డబ్బులు జమ అవుతాయి. సన్న వడ్ల రైతుల వివరాలు ఇప్పటికే ఉన్నతాధికారులకు అందజేశాం.

– సుగుణబాయి, డీఎం పౌరసరఫరాల శాఖ

అందరికీ రైతు భరోసా

జిల్లాలో రైతు భరోసా పొందడానికి అర్హత ఉన్న ప్రతీ రైతుకు రైతు భరోసా నిధులు మంజూరు అవుతాయి. పంటలు సాగు చేస్తున్న రైతుల ఖాతాల్లోకి డబ్బులు వస్తాయి.

– చంద్రకళ, జిల్లా వ్యవసాయాధికారి